RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 267 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

మంగళవారం 28 మే 2024

# ఈ సీఎస్ వద్దు...



- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ కు లేఖ రాసిన కనకమేడల.!
- జవహర్ రెడ్డి ప్రభుత్వ అసైన్డ్ భూములు కొనుగోలు చేశారని ఆరోపణ.
- కొడుకు, బినామీల పేరిట 800 ఎకరాలు కొన్నారని వెల్లడి.
- కౌంటింగ్ సజావుగా సాగడంపై అనుమానం ఉందంటూ సీఈసీకి లేఖ.

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 27:**
టీడీపీ నేత కనకమేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ కు లేఖ రాశారు. ఏపీ సీఎస్ జవహర్ రెడ్డి ప్రభుత్వ అసైన్డ్ భూములను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారని వెల్లడించారు. తన కుమారుడు, బినామీల పేరిట సీఎస్ భూములు కొన్నారని వివరించారు. ఆ విధంగా సీఎస్ 800 ఎకరాలు కొనుగోలు చేశారని కనకమేడల తెలిపారు. ఇప్పుడు భూముల రిజిస్ట్రేషన్ కోసం అధికారులను ప్రభావితం చేస్తున్నారని తన లేఖలో పేర్కొన్నారు. సీఎస్ అధికార యంత్రాంగాన్ని, తన అధికారాలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆయన ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని తెలిపారు. ఈ నేపథ్యంలో, కౌంటింగ్ సజావుగా సాగడంపై ప్రతిపక్షాలకు అనుమానం ఉందని కనకమేడల వెల్లడించారు. సీఎస్ వ్యవహార శైలి ఓట్ల లెక్కింపుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎస్ ని తొలగించి సీబీఐ విచారణకు ఆదేశించాలని సీఈసీని కోరారు.





## చంద్రబాబు వ్యూహంలో జగన్ ఇరుక్కున్నాడా..?

# ప్రభుత్వ ఏర్పాటులో పోస్టల్ ఓట్లు దే కీలక పాత్ర..!



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 27
ఏపీలో జూన్ 4న ఏమి జరగనుంది అన్నది ఒక ఎడ తెగని ఉత్కంఠ. అయితే ఆ రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ స్టార్ట్ అవుతుంది. ఏపీ వ్యాప్తంగా ఉన్న మొత్తం ఉమ్మడి పదమూడు జిల్లాలలో కూడా శరవేగంగా ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఈసారి పోలింగ్ లో ఒక కీలక డెసిషన్ తీసుకోబోతున్నారు. అదేంటి అంటే పోస్టల్ బ్యాలెట్ ని మొదట లెక్కించడం. సాధారణంగా కూడా అదే జరుగుతుంది. కానీ ఈసారి మరింత ఫోకస్డ్ గా దీని మీద ఈసీ దృష్టి పెట్టడానికి కారణం పోస్టల్ బ్యాలెట్ కూడా ఆషామాషీ రికార్డు క్రియేట్ చేయలేదు. ఏకంగా కొన్ని జిల్లాలలో అయితే నూరు శాతం కూడా ఓటింగ్ నమోదు అయింది.
దాంతో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపట్టడానికి ప్రత్యేకంగా టేబిల్స్ వేసి మరీ ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఏకంగ అయిదు లక్షల దాకా పోస్టల్ బ్యాలెట్ పోల్ అయింది ఈసారి అని అంటున్నారు. సాధారణ ఎన్నికలతో పాటుగానే వాడిగా ఇది జరిగింది అని చెబుతున్నారు. దీంతో మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కించి ఆ మీదట సాధారణ ఓట్లను లెక్క పెడతారు అని అంటున్నారు పోస్టల్ బ్యాలెట్ లో ఎక్కువ శాతం ఓట్లు ఎవరికి పడ్డాయి అంటే టీడీపీ కూటమికి అని అనధికారికంగా ప్రచారం సాగుతోంది. ఉద్యోగులు ఉపాధ్యాయులు వివిధ వర్గాలు సర్కార్ మీద ఆగ్రహంగానే ఇంత పెద్ద ఎత్తున ఓట్లు వేశారు అని అంటున్నారు. అదే జరిగితే మాత్రం వైసీపీకి బిగ్ షాక్ అని అంటున్నారు. ఇక ఒక ప్రముఖ సర్వే సంస్థ




విశ్లేషకుడి అంచనా ప్రకారం చూస్తే నూటికి డెబ్బై అయిదు శాతం ఓట్లు కూటమికి పడ్డాయని అంటున్నారు. అంటే ఇది భారీగా వైసీపీకి నష్టం గా మారే అంశం. ఇక ఉదయాన్నే కౌంటింగ్ ప్రారంభం అయితే మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గంలో వచ్చే మెజారిటీలు అన్నీ భారీ ఎత్తున టీడీపీ కూటమికే వస్తాయని అంటున్నారు. దాదాపుగా నూటికి తొంబై శాతం నియోజకవర్గాల్లో తొలి ట్రెండ్స్ లోనే టీడీపీ ఆధిక్యతను గట్టిగా చాటి చెబుతాయని అంటున్నారు. ఇక ఒక్కో జిల్లాలో సగటున ఏకంగా ముప్పై వేల దాకా పోస్టల్ బ్యాలెట్ పడింది. అంటే జిల్లాలో ఎవరేజ్ లెక్కన పది అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటే మూడు వేల ఓట్లు తక్కువ కాకుండా పోస్టల్ ఓట్లు జత కలుస్తాయన్న మాట. ఈసారి హెూరా హెూరీ పోరుగా సాగిన సంగతి విధితమే అలాంటపుడు నూటికి డెబ్బై అయిదు శాతం ఓట్లు కూటమికి పడాయని ప్రచారం సాగుతోంది. చాలా చోట్ల వేయి అయిదు వందల ఓట్లతో కనుక గెలుపు ఓటములు సాగితే మాత్రం ఈ పోస్టల్ బ్యాలెట్ అక్కడ ఫలితాన్ని డిసైడ్ చేస్తుంది అని అంటున్నారు. ఆ విధంగా మొత్తానికి మొత్తం ఫలితాన్నే చేంజ్ చేసే సత్తా పోస్టల్ బ్యాలెట్ కి ఈసారి ఉంది అని అంటున్నారు. దాంతో ఇపుడు ఎవరైనా భారీ మెజారిటీలు అంటే పది వేలకు పై చిలుకు ఓట్లు సాధిస్తేనే తప్ప పోస్టల్ బ్యాలెట్ ప్రభావాన్ని తప్పించుకోలేరు అని అంటున్నారు.
ఇవన్నీ పక్కన పెడితే తొలి ట్రెండ్స్ టీడీపీ కూటమికి అనుకూలంగా రావడం అంటే జనవరి 4 తొలి గంటలల్లోనే ఏపీలో విపక్షం సంతోషాన్ని ఎవరూ ఆపలేరని అంటున్నారు. మధ్యాహ్నానికి ఫలితం తుది రూపు తెలియవచ్చు. అపుడు ఈ తొలి ట్రెండ్స్ ఓట్లు ఎంత మేరకు గెలుపుని శాసిస్తాయో చూసిన మీదట ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో విజేత నిర్ణయం అవుతారు. అంతవరకూ మాత్రం కూటమి ఆనందాన్ని జోష్ ని ఎవరూ ఆపలేరు అని అంటున్నారు. ఇక అసలు ఫలితాల్లో కూడా కూటమి కనుక జోరు ప్రదర్శిస్తే ఏపీ రాజకీయం టోటల్ చేంజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## ఇండియా కూటమి మతం ఆధారంగా రిజర్వేషన్లు తీసుకొస్తుంది..!

**-భారత ప్రధాని నరేంద్ర మోడీ సంచలన వ్యాఖ్యలు.**



ఆంధ్ర ప్రగతి ఉత్తరప్రదేశ్ మే 27: ఇండియా కూటమి పై నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. మత ప్రాతిపదిక రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని తిరగరాస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.."దేశంలోని మెజారిటీ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చాలని ప్రతిపక్ష ఇండియా కూటమి భావిస్తోంది అని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు తొలగించి ముస్లింలకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇండియా కూటమి వివిధ కులాలు తమను తాము కొట్టుకునేలా చేస్తోంది అని ఆరోపించారు. కూటమిలో భాగస్వామ్యం అయిన సమాజ్‌వాదీ పార్టీ పూర్వాంచల్‌ని మాఫియా, పేదరికానికి అడ్డగా మార్చింది అని అన్నారు. కులాలు బలహీనంగా మారేందుకు ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారు. రాత్రికి రాత్రే ముస్లిం కులాలను ఓబీసీలుగా ప్రకటిస్తున్నారు. ఇటీవల కలకత్తా హైకోర్టు 77 ముస్లిం కులాలకు ఇచ్చిన ఓబీసీ రిజర్వేషన్లను తిరస్కరించింది అని గుర్తు చేశారు.

# మార్పు కనిపిస్తోందా..?

## ఆ పార్టీకి సీన్ అర్థమయిపోయిందా..?

ఆంధ్ర ప్రగతి అమరావతి మే27: ఆంధ్రప్రదేశ్ లో అధికారం మారుతోందన్న విషయం ప్రస్ఫుటంగా తెలుస్తోంది. ఇంత కాలం వైసీపీ అడుగులకు మడుగులొత్తిన పోలీసులు ఇప్పుడు తటస్థంగా ఉంటున్నారు. అంతే కాదు ఎన్నికల సంఘం పలువురు పోలీసు అధికారులపై వేటు వేసింది. అలా వేటు పడిన స్థానంలో వచ్చిన వారు.. మరింత మందిని కీలక విధులకు దూరం చేశారు. మరింత మందిపై నిఘా పెట్టారు. ఈ మార్పు ఒక్క సారిగా పోలీసు వ్యవస్థలో కింది నుంచి పై దాకా ఉలిక్కిపడేలా చేసింది. నిబంధనలను అతిక్రమిస్తే ఏం జరుగుతుందో, ఒక పార్టీతో అంటకాగితే జరిగే పరిణామాలేమిటో తేటతెల్లం చేసింది. దీంతో ఏపీ పోలీసుల తీరు ఒక్కసారిగా మారిపోయింది. గత ఐదేళ్లూ ఒక తీరు..
గత కొద్ది రోజులుగా మారో తీరుగా మారిపోయింది. వైసీపీ హయాంలో అంటే గత ఐదేళ్లుగా పోలీసు అధికారులకు పదోన్నతులు, కీలక పోస్టింగులకు వారిపై ఉన్న అభియోగాలూ, అధికార పార్టీకి అనుకూలంగా పని చేయడానికి సై అనడమే అర్హతలుగా మారాయి. ఇప్పుడు అలా కీలక పోస్టింగులలో వచ్చి తిష్ట వేసిన వారికి ఇప్పుడు స్థాన చలనం కలిగింది. ఇక మిగిలిన వారిలో భయం మొదలైంది.



దీంతో మొత్తం పరిస్థితి వైసీపీకి రివర్స్ అయినట్లుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం ఖాయమని చెప్పడానికి వైసీపీ పెద్దల మాటలను కింది స్థాయి పోలీసులే ఖాతరు చేయకపోవడాన్ని ఉదాహరణగా పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ వైసీపీ బాధితులపైనే కేసుల నమోదుకు పరిమితమైన పోలీసులు ఇప్పుడు వైసీపీ కేడర్, నాయకులపై కూడా యాక్షన్ తీసుకోవడానికి, కేసులు నమోదు చేయడానికి వెనుకాడటం లేదు. రాష్ట్రంలో మారిన ఈ పరిస్థితే జూన్ 4న ఫలితం ఎలా ఉండబోతోందో చెబుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎందుకంటే ప్రజల నాడి ఎలా ఉందో, ప్రజల మొగ్గు ఎటువైపు ఉందో అందరి కంటే నిక్కచ్చిగా, కచ్చితంగా అంచనా వేయగలిగేది క్షేత్ర స్థాయిలో పోలింగ్ విధులు నిర్వహించిన పోలీసులే అని అంటున్నారు.

# ఏపీ ఫలితాలపై రఘువీరారెడ్డి సంచలన జోష్యం.!

ఆంధ్ర ప్రగతి అనంతపురం మే 27:
ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి జరిగిన భారీ పోలింగ్ నేపథ్యంలో ఫలితాలపైనా ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా గతంతో పోలిస్తే పెరిగిన పోలింగ్ శాతం, రాష్ట్రం బయట ఉన్న వారు భారీగా వచ్చి పోలింగ్ లో పాల్గొనడం, వైసీపీ, కూటమికి మధ్య జరిగిన హెూరాహెూరీ పోరు నేపథ్యంలో ఫలితాలపై ఉత్కంఠ అంతకంతకూ పెరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఇవాళ ఓ యూట్యూబ్ ఛానల్ తో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలు 8 వేల కోట్లు, 6 వేల కోట్ల చొప్పున ఖర్చు పెట్టాయని రఘువీరారెడ్డి వెల్లడించారు. వారితో పోటీ పడి కాంగ్రెస్ పార్టీ ఎక్కువ సీట్లలో గెలిచే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ఈసారి డబ్బు ప్రభావం పనిచేయని రెండు, మూడు సీట్లలో గెలిచే అవకాశం ఉందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఎంపీ సీట్లలో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు భావిస్తున్నట్లు రఘువీరా తెలిపారు. అలాగే ఈసారి ఎన్నికల్లో ఎవరికీ గాలి లేదని రఘువీరా తెలిపారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 2009 రిపీట్ అవుతుందేమో అనిపిస్తోందన్నారు. అప్పటి ఎన్నికల్లోనూ తమకు నామమాత్రపు సీట్లతో మెజార్టీ వచ్చిందన్నారు. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే ఏ పార్టీ ఇలా బయటపడుతుందో మాత్రం ఆయన చెప్పలేదు. గెలిచే వారికి మాత్రం 95-97 సీట్లే వస్తాయన్నారు. అలాగే 100 మంది ఎమ్మెల్యేలకు మెజార్టీ 10 వేల లోపే ఉంటుందన్నారు. కచ్చితంగా ఇది క్లోజ్ ఫైట్ అన్నారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మున్సిపల్ అధికారులు..!




- కుందూ ఒడ్డునే డంపింగ్ యార్డ్ వ్యర్థాలు నిల్వలు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకవైపు ఒక్కసారి చూడండి.
- ఆ కాంట్రాక్టర్ కె వత్తాసు పలుకుతున్న అధికారులు.
- ముగ్గురు అధికారులకు 10,ఒక అధికారికి 10 చీకటి ఒప్పందాలు జరిగాయా.
- కుందూ పరీవాహక ప్రాంతం ప్రజలు ధర్నాకు సిద్ధం అయ్యారా.?





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 27:**

నంద్యాల మున్సిపల్ అధికారులకు ప్రజల ప్రణాలంటే లెక్కలేకుండా పోయింది.కాంట్రాక్టర్ ఇచ్చే చిల్లర డబ్బులకు ఆశపడి కుందూ సమీపంలోనే డంపింగ్ యార్డ్ వ్యర్థాలు వేస్తున్నా పట్టించుకోకపోవడం విశేషం.సాక్ష్యాలతో కళ్ళ ముందు కనిపించే విధంగా ఫోటోలు,విడియోలు పెడుతున్నా పాత్రికేయులకు పనీ పాటా లేకుండా వార్తలు రాస్తున్నారని అధికారులు చెప్పుకోవడం విశేషం.కుందూ ఎక్కడినుంచి,ఎక్కడి వరకు వుంది,ఎన్ని కిలోమీటర్లు,ఎన్ని కుందూ పరీవాహక గ్రామాలు వున్నాయి,కుందూ నీటిని ఎందరు ఉపయోగిస్తున్నారు అనే లెక్కలు అధికారులకు తెలుసా ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గత కొద్దిరోజులుగా డంపింగ్ యార్డ్ వ్యర్థాలు కుందూ ప్రాంతంలో నిలువ చేయడంతో వర్షాలు అధికంగా వస్తె ఆ వ్యర్థాలు కుందూ లో కలిస్తే దిగువ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇబ్బందులుగా మారుతాయని ముందుగానే హెచ్చరించడం పాత్రికేయుల తప్పా. లక్షల జీతాలు తీసుకుంటూ కాసులకు కక్కుర్తి పడిన కొందరు అధికారులు కుందూ సమీపంలోనే వేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాని ప్రశ్న గా మిగిలిపోయింది.వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణ శివారులోని డంపింగ్ యార్డ్ లోని వ్యర్థాలు మూడు విభాగాలుగా విభజించి చివరిగా వచ్చే వ్యర్థాలు దూర ప్రాంతాలకు తరలించాలి.కాంట్రాక్టర్ కు మొత్తం పనులు చేసేందుకు 5.50 కోట్లు టెండర్ లో దక్కించుకున్నారు.ఏడాది క్రితమే పనులు పూర్తి చేయల్సివున్నా అధికారులు,కాంట్రాక్టర్ మధ్య జరిగిన చీకటి ఒప్పందంతో నేటి వరకు నత్త నడకన సాగుతుంది.వర్షాకాలం ప్రారంభం కావడంతో కుందూ ప్రాంతంలో జరుగుతున్న తతంగాన్ని కె.ఎస్.కె.న్యూస్ స్వయంగా వెళ్లి పరసిలించింది.కుందూ పరీవాహక ప్రాంతం ప్రజలకు ముప్పు పొంచి ఉందని తెలుసుకుని ,ప్రజల ప్రాణాలు కాపాడడానికి తన వంతు పాత్ర పోషించింది.వార్త ప్రచురించడం కొద్ది రోజులు సైలెంట్ గా వున్నారు.ఆదివారం ఉదయం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకవైపు హెలికాప్టర్ ఆగే స్థలం సమీపంలో దాదాపు 200 ట్రాక్టర్ ల డంపింగ్ యార్డు వ్యర్థాలు వేస్తుండడం వాకింగ్ చేసేవారు గమనించి దుర్వాసన వస్తున్న అక్కడికి వెళ్లి ఫోటోలు తీసి కె.ఎస్.కె.న్యూస్ కు పంపించారు.కుందూ కు సమీపంలోనే వుండడం,భారీ వర్షాలు పడితే పరిస్థితి ఏంటో అటు ప్రజలు,ఇటు అధికారులు కె తెలియాలి.కె.ఎస్.కె.న్యూస్ పై అభాండాలు వేస్తున్న అధికారులకు సూటి ప్రశ్న వేస్తున్నాను చెప్పండి.రెండేళ్లుగా పని పూర్తి కాకపోతే ఏమి చేస్తున్నారు,డంపింగ్ యార్డ్ వ్యర్థాలు ఎక్కడ వేయాలి,పర్యావరణ అనుమతులు వున్నాయా.మొదటి బిల్లు గుంతకల్లు నుంచి వచ్చినా వారితో కార్యాలయంలో కి రప్పించుకొని బిల్లులు ఎందుకు తయారు చేస్తున్నారు.నేటికీ పనులు చేసి వుంటే మొదటి బిల్లు ఎందుకు పెండింగ్ పెట్టారు.బిల్లు ఏ విధంగా పెట్టారో మీడియా ముఖంగా చెప్పగలరా.మాకు ఎలాగూ పని పాట లేదు కాదా.మరో ఆరోపణ అధికారులపై వినిపిస్తుంది మొదటి బిల్లు కు అధికారులకు 10 లక్షలు మామూలు ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.మరో అధికారికి 10 లక్షలు మాములు ఇవ్వడం లేదని సంతకం చేయకుండా వున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.మీడియా పై చిందులు వేయడం పక్కన పెట్టీ ప్రజల ప్రాణాలు కాపాడండి.కుందూ పరీవాహక ప్రాంతం ప్రజలు త్వరలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కు సిద్దం అవుతున్నట్టు సమాచారం.ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గుట్టలు,గుట్టలుగా పడిన డంపింగ్ యార్డ్ వ్యర్థాలు చూసైనా అధికారులు మీడియా పై చిందులు వేయడం మానుకోండి.భూమా నాగిరెడ్డి లాంటి నాయకులు వుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి.ఓట్లే ముఖ్యం,పదవులే ముఖ్యం అనే నాయకులు వున్నంత వరకు అధికారులు చెప్పిందే వేదం.కౌన్సిల్ లో పశువులు,గొర్రెలు అని సంబోధించి నా,చిరుద్యోగీ చేతి వాటం ప్రదర్శించినా, నేతల ఇళ్లలో పని చేస్తున్న సిబ్బందికి మున్సిపాలిటీ లోనుంచి జీతాలు ఇస్తున్నా నేటి వరకు చలనం లేదు.అధికారులు మీరు చేసి తప్పిదాలు తెలుసుకోండి,మీడియా పై చిందులు వేయడం మానుకోండి.వాస్తవంగా డంపింగ్ యార్డుకు గోడలే కాదు సి.సి.కెమెరాలు,పోల్స్ ఇంకా కొన్ని విరిగిపోయినట్లు తెలిసింది.రెండు రోజుల్లో డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న తటంగా ఆధారాలతో సహా అందించే ప్రయత్నం చేస్తాను.పని పాట లేకుండా రాయలేదు సాక్ష్యాలతో సహా ఫోటోలు పెడుతున్నాను నాయకులు,అధికారులు స్పందించరు ,ప్రజలైనా స్పందిస్తారో లేదో వేచి చూద్దాం.

# వైసీపీ ది విశ్వాసమా..? అతివిశ్వాసమా..?

## ఎక్కడో తేడా కొడుతోంది..!



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 27: ?

ఏపీలో మరోసారి అధికారం ఖాయమని వైసీపీ చెబుతోంది. జగన్ మరోసారి సీఎంగా ప్రమాణం ఖాయమని నమ్మకంతో ఉంది. జగన్ ప్రమాణ స్వీకార ముహూర్తం ఖరారు చేసింది. ఇందు కోసం వైసీపీ నేతలు విశాఖ కు వచ్చేందుకు హోటళ్లు బుక్ చేసుకున్నారు.విమాన, ప్రయివేటు బస్సు ఛార్జీలు రెట్టింపు అయ్యాయి. అసలు ఫలితాలు రాకుండానే వైసీపీ ఇంతలా ఎందుకు హంగామా చేస్తుంది. ఇది విశ్వసమా..అతి విశ్వాసమా..అసలు ఏంటి వైసీపీ నేతల ధీమా.

ముఖ్యమంత్రి జగన్ తనకు రెండో సారి అధికారం దక్కినట్లేనని ధీమాగా ఉన్నారు. ఎన్నికల తరువాత ఐప్యాక్ టీంతో సమావేశం సమయంలో 2019 లో వచ్చిన 151 అసెంబ్లీ..22 ఎంపీ సీట్ల కంటే ఎక్కువగా విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేసారు. ఆ తరువాత జగన్ విదేశీ పర్యటనకు వెళ్లారు. ఈ నెల 30న తిరిగి రానున్నారు. అయితే, పోలింగ్ సరళి చూసిన తరువాత వైసీపీ శ్రేణుల్లో నిజంగా జగన్ చెప్పినట్లుగా 151 కంటే ఎక్కువ సీట్లు సాధ్యమేనా అనే సందేహాలు మొదలయ్యాయి. జగన్ ప్రచారం కోసం చెప్పే వ్యక్తి కాదని..జగన్ చెప్పే మాటకు విలువ ఉంటుందనేది మరో వాదన. కానీ, సొంత పార్టీ నేతలకే వాస్తవంగా జగన్ ప్రకటన పైన నమ్మకం కుదరటం లేదు.



ఇక..బొత్సా..వైవీ సుబ్బారెడ్డి లాంటి నేతలు జగన్ రెండో సారి సీఎంగా ప్రమాణ స్వీకార ముహూర్తం ప్రకటించారు. జూన్ 9న జగన్ విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారని ఫిక్స్ చేసారు. జగన్ మరోసారి సీఎం కావటం ఖాయమని నమ్ముతున్న వైసీపీ నేతలు ఆ రోజు కోసం విశాఖలో హోటళ్లు బుక్ చేసుకుంటున్నారు. విమానాలు ఆ రోజుకు విశాఖ వచ్చేవి ఫుల్ అయ్యాయి. ప్రయివేటు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని ట్రావెల్స్ జూన్ 8, 9 తేదీల్లో విశాఖకు ఛార్జీలను రెట్టింపు చేసాయి. సోషల్ మీడియాలోనూ జగన్ చెప్పిన విధంగానే సీట్లు గెలుస్తామంటూ సర్వే నివేదికలు, అంచనాలను వెల్లడిస్తున్నారు. ఇదే సమయంలో అటు చంద్రబాబు క్యాంపు గెలుపు అంచనాల పైన మౌనం పాటిస్తోంది.వైసీపీ 2019 లో 51 శాతం ఓట్ షేర్ సాధించింది. ఫలితంగా 151 సీట్లు వచ్చాయి. ఈ సారి రెండు శాతం వరకు పోలింగ్ పెరిగింది. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓటు అని ప్రతిపక్షాలు...అనకూల ఓటుగా వైసీపీ నేతలు వాదిస్తున్నారు. పోలింగ్ సమయంలోనూ ప్రభుత్వ వ్యతిరేకత కనిపించిందనే వాదన ఉంది. వైసీపీ మాత్రం ప్రభుత్వ సానుకూలత కనిపించిందని చెబుతోంది. కొందరు వైసీపీ నేతలు సీట్ల సంగతి ఎలా ఉన్నా..అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 1.69 కోట్ల మంది మహిళలు ఓట్లు వేసారని..మెజార్టీ తమకే దక్కుతాయని విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో మెజార్టీ వర్గాలు వైసీపీ పాలన పైన ఆగ్రహంతో ఉన్నారనే విశ్లేషణ ఉంది. వైసీపీ చేస్తున్న వాదనతో జూన్ 4న వెల్లడయ్యే ఫలితాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

# చంద్రబాబు వ్యూహంలో జగన్ ఇరుక్కున్నాడా..?



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 27:

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు ముగిశాయి. రిజల్ట్ కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. ఇదే తరుణంలో వైసిపి మరియు టిడిపి కూటమి మధ్య హొరాహొరీ పోటీ సాగినట్టు తెలుస్తోంది.కానీ చాలా సర్వేలు వైసీపీకి అనుకూలంగా ఉందని అంటున్నారు. అంతేకాదు వైసిపి అధినేత జగన్ కూడా తానే అధికారంలోకి రాబోతున్నానని బాహాటంగానే చెప్పారు. టిడిపి కూటమి అధినేత చంద్రబాబు మాత్రం ఎన్నికలు జరిగినప్పటి నుంచి సైలెంట్ అయిపోయారు. ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. కొంతమంది వైసీపీ నాయకులు బాబు భయపడుతున్నారని, ఆయన జగన్ ట్రాప్ లో పడ్డారని అంటున్నారు. నిజానికి జగన్ ట్రాప్ లో చంద్రబాబు పడలేదు. చంద్రబాబు వ్యూహంలోనే జగన్ ఇరుక్కున్నారని కొన్ని వార్తలు వినిపిస్తున్నాయి. అవేంటో చూద్దాం.

ఏపీలో ఎన్నికలు జరిగిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఈ పరిస్థితులను గమనించిన చాలామంది వైసీపీ నేతలు ఎన్నికల కమిషన్ పై దుమ్మెత్తి పోస్తున్నారు. అధికారులు మాకు సపోర్ట్ చేయలేదనే తీరును వ్యక్తపరుస్తున్నారు. అధికారంలో ఉన్న జగన్ కు ఎన్నికల అధికారులు సపోర్ట్ చేయలేదు అంటే దాని వెనుక చంద్రబాబు పెద్ద వ్యూహమే పన్నారు అనేది వారికి తర్వాత అర్థమైంది. ముఖ్యంగా వైసిపికి ఎక్కువ పట్టు ఉన్నటువంటి అనంతపురం, చిత్తూరు, పల్నాడు, జిల్లాల్లో చంద్రబాబు తన బలం బలగంతో సాధ్యం కాని పనులను అధికారుల అండతో సాధ్యం చేశారు. గోవర్ధన్ రెడ్డి, పేర్ని నాని సజ్జల రామకృష్ణారెడ్డి వంటి పెద్దపెద్ద నేతలు కూడా ఈసీ పైనే విమర్శలు చేశారు. కానీ చంద్రబాబు మాత్రం ఈసీని ఏమాత్రం తప్పు పట్టడం లేదు.

చాలా సైలెంట్ గా తన పని తాను చేసుకున్నారు అంటే చంద్రబాబు జగనును కట్టిడి చేయడం కోసమే, వ్యూహం పన్నారని, దాన్ని అధికారులు విజయవంతంగా ముగించారని తెలుస్తోంది. అందుకే ఆయన బిజెపితో పొత్తు పెట్టుకున్నారని, బిజెపితో పొత్తు వల్ల కొన్ని ముస్లిం మైనారిటీ ఓట్లు తనకు పడవని తెలిసినా పొత్తు పెట్టుకున్నది జగన్ ను కట్టడి చేయడానికే అన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఆమాత్రం గొడవలు లేకుండా వన్ సైడ్ ఓటింగ్ జరగకుండా వైసిపి నాయకులను కట్టడి చేసి ఈసీని, పోలీసు అధికారులను తన వైపు తిప్పుకున్నారు. ఇక చంద్రబాబు నిర్ణయం వల్ల పోలింగ్ మాత్రం చక్కగా జరిగింది కానీ ప్రజలు ఏ వైపు ఓటు వేశారు అనేది చాలా ఆసక్తికరంగా మారింది. రిజల్టు ఏ వైపు వస్తుంది అనేది తెలియాలంటే జూన్ 4 వరకు వెయిట్ చేయాల్సిందే.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 28 మే 2024

## మధ్యాహ్న భోజన స్కావెంజర్ కార్మికులకు

# పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి




ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 27:
ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మి కులు స్కావెంజర్స్ కు పెండింగ్ వేతనాలు వెంటనే ఇచ్చి ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి బాల వెంకట్ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గ్రేసమ్మ స్కావెంజర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు శేషమ్మ శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రంను జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని మంచి లక్ష్యాలతో ఈ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నాయని ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు . ఈ పథకంలో పనిచేసే కార్మికులకు మాత్రం ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారితో వెట్టి చాకిరి చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు 20 రూపాయల పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు . జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యాహ్నం భోజన కార్మికులకు పదివేల రూపాయలు వేతనం ఇస్తానన్న వాగ్దానం ఐదు సంవత్సరాలు పూర్తి అయిపోయిన నెరవేర్చలేకపోయాడని ఈ పథకంలో పనిచేసే కార్మికులకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని గుర్తింపు కార్డులు ఉద్యోగ భద్రత కార్మికులకు కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని సెలవులు మేటర్నిటీ లీవ్ల, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఈ పథకంలో పనిచేసే కార్మికులకు నెలకు పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మరియు స్కావెంజర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు.

## ప్రశాంత వాతావరణంలో

# ఓట్ల లెక్కింపుకు పటిష్ట ప్రణాళిక






ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే, 27:
వచ్చేనెల 4వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ కు నివేదించారు.. ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి సోమవారం కేంద్ర ఎన్నికల అధికారులు జ్ఞానేష్ కుమార్, డా.సుఖ్బీర్ సింగ్ సంధు లతో కలిసి కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ వివిధ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ మాట్లాడుతూ జూన్, 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ఠమైన ప్రణాళికతో నిర్వహించాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. దేశంలోని కొన్ని ప్రాంతాలలో మినహా పలు రాష్ట్రాలలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సిబ్బంది ప్రశాంత వాతావరణంలో నిర్వహించారని, ఎటువంటి సమస్యలు లేకుండా పోలింగ్ నిర్వహించిన ఎన్నికల సిబ్బందిని ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ అభినందించారు. అదే స్ఫూర్తితో ఎటువంటి శాంతి భద్రతల సమస్య లేకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు రిటర్నింగ్ అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. కౌంటింగ్ కొరకు నియమించిన సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించాలన్నారు. ఈవీఎం లను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను రిటర్నింగ్ అధికారులు ప్రతీ రోజు సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతవాతావరణంలో ఓట్లు లెక్కింపు నకు చర్యలు చేపట్టామన్నారు.

## కౌంటింగ్ విధులు పారదర్శకతతో

# జాగ్రత్తగా నిర్వహించండి.

### -జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు



ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 27:
జూన్ నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు విధులను పారదర్శకతతో ఎలాంటి చిన్న పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంపూర్ణ శిక్షణ పొంది అవగాహన పెంచుకోవాలని కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. నంద్యాల పార్లమెంటుతో పాటు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోస్టల్ బ్యాలెట్ లను లెక్కించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రతి కౌంటింగ్ కేంద్రంలో14 టేబుల్స్, కౌంటింగ్ విధులు నిర్వహించేందుకు మొదటి ర్యాండమైజేషన్ లో కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్వైజర్, మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. సమర్థవంతమైన కౌంటింగ్ విధుల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా క్షుణ్ణంగా అడిగి తెలుసుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్ లో ఈవిఎమ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఏ విధంగా నిర్వహించాలన్న అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ సమయంలో రౌండ్ల వారీ వివరాలను ఏజెంట్లకు వినపడేలా కౌంటింగ్ సిబ్బంది చదవాలని, మైక్రో అబ్జర్వర్లు కూడా సదరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రౌండ్ పూర్తి అయిన వెంటనే ఏజెంట్లతో సంతకాలు తీసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి పార్లమెంటుకు గ్రీన్ కవర్స్, అసెంబ్లీకి పింక్ కవర్స్ టేబుల్స్ మీద ఉంచడం జరుగుతుందన్నారు. మొదటిగా సదరు కవర్ ఎన్నికల కమీషన్ వారు ఇచ్చినదా కదా ? బ్యాలెట్ కు సంబంధించి అటెస్టేషన్ చేసిన అధికారి సీల్, సంతకం, డిక్లరేషన్, సీరియల్ నెంబర్, ఓటర్ సంతకం ఉందా సీరియల్ నెంబర్ మ్యాచ్ అవుతుందా లేదా అని ప్రాథమిక నిర్ధారణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జూన్ 4వ తేదీ ఉదయం 5.30 గంటలకు జరిగే రెండవ ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ కేంద్రాలలో ఏ టేబుల్ కి ఏ సిబ్బంది కేటాయించబడారనే విషయం తెలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.
నంద్యాల అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈవిఎమ్, వివి ప్యాట్ యంత్రాల్లో అడ్రస్ ట్యాగ్, పింక్ పేపర్ సీల్, గ్రీన్ పేపర్ సీల్, కౌంటింగ్ ఏ విధంగా చేయాలనే అంశాలపై కౌంటింగ్ సిబ్బందికి వివరించారు. ఓట్ల లెక్కింపు విధుల్లో సంపూర్ణ శిక్షణ పొంది ప్రతి అంశంపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది ఖచ్చితంగా కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటలకే ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ హాళ్లకు కు చేరుకోవాలన్నారు.

## శ్రీ ఆంజనేయ ఆధ్వర్యంలో

# తనిఖీలు చేసిన వ్యవసాయ అధికారులు.



అంతర్గత తనిఖీ అధికారుల బృందం సహాయ వ్యవసాయ సంచాలకులు,ఆత్మకూరు శ్రీ ఆంజనేయఆధ్వర్యంలో నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ శేఖర్ మరియు నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తో కలిసి ఆకస్మికంగా పలు విత్తన దుకాణాలలో తనిఖీ చేయడం జరిగింది.
తనిఖీలో భాగంగా పలు విత్తన దుకాణాల యందు తనిఖీ చేయగా సరైన ధ్రువ పత్రాలు సమర్పించనందున ప్రత్తి మరియు మిరప 19 లక్షల రూపాయల విలువ గల విత్తనాలను అమ్మకపు నిలుపుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఆత్మకూరు వారు శ్రీ ఆంజనేయ గారు మాట్లాడుతూ విత్తన దుకాణాల యజమానుల

1. అనుమతి ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని,
2. సరైన ధృవ పత్రాలు కలిగి ఉండాలని, నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలని,
3. MRP కంటే ఎక్కువ ధరకు విక్రయించారాదని,
4. అదేవిధంగా విత్తనం కొన్న ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలని చెప్పడం జరిగింది.
5. స్టాక్ బోర్డు ప్రతీరోజూ అప్డేట్ చెయ్యాలని

అదేవిధంగా స్టాక్ బుక్ మరియు గ్రౌండ్ బ్యాలెన్స్ సరిగా ఉండేట్లు చూసుకోవాలని హెచ్చరించడం జరిగింది.విత్తన చట్టం 1966 కి అనుగుణంగా అన్ని పాటించి వ్యాపారం చేస్కోవాలని అలా లేనిచో విత్తన చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది.

## బుడగ జంగాల నిరుపేదలకు

# టార్పాలిన్లు పంపిణీ చేసిన రెడ్ క్రాస్

### -డోన్ డివిజన్లో రెడ్ క్రాస్ సేవలు విస్తరింప చేస్తాం.
### -డివిజన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్/ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి.





ఆంధ్ర ప్రగతి డోన్ మే 27: నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని జంగాల కాలనీలో ఇటీవల కురిసినటువంటి అకాల వర్షాలకు బుడగ జంగాల వారి నివాసాలు విచ్ఛిన్నం కావడంతో వారికి గుడారాలు (టార్పాలిన్స్) పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి ఆదేశాల మేరకు డోన్ పట్టణంలో డోన్ రెవెన్యూ డివిజన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ మరియు డోన్ ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా జంగాల కాలనీలో రెడ్ క్రాస్ రాష్ట్ర కమిటీ పంపిన టార్పల్లినులను ఈరోజు ఇండియన్ రెడ్ క్రాస్ డోన్ డివిజన్ అధికార ప్రతినిధి కొచ్చెరువు వెంకటేశ్వర్లు సామాజిక కార్యకర్త పి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా ఆర్డీవో బి మహేష్ రెడ్డి చేతులమీద పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో పాల్గొనవారు ఏ బాలసుబ్బయ్య ప్రవీణ్ కుమార్ చాంద్ రఘు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో

# పోలీస్ కవాతు నిర్వహణ.



ఆంధ్ర ప్రగతి నంద్యాల 27:
నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ఆదేశాలమేరకు నంద్యాల టౌన్ డిఎస్పి ఎన్ రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్, మూలాన్ పేట్ ,ఆత్మకూరు బస్టాండ్ , సిటీ బస్టాండ్ మొదలగు ప్రాంతాలలో పోలీస్ కవాతు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది కాబట్టి ఎలాంటి ర్యాలీలు సభలు సమావేశాలకు అనుమతి లేదని కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరు గుంపులుగా ఉండకూడదని కౌంటింగ్ దృష్టిలో ఉంచుకొని టౌన్ నందు ఎలాంటి అల్లర్లు ,గలటాలు, వివాదాలు జరగకుండా ఉండేందుకు ఈ పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డిఎస్పి తో పాటు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి.వి చలపతి ,తాలూకా ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవాసపురం ఆలయంలో

# ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల/రుద్రవరం మే 27:** రుద్రవరం అప్పనపల్లి ప్రధాన రహదారిలో వెలసినటువంటి శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్స వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం శ్రీ మహా త్రిపుర సుందరి సమేత మానస సరోవర లింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పురోహితులు వెల్లాల పుల్లయ్య ,వారణాసి గోపి శర్మ ,శివ స్వామి ఆధ్వర్యంలో ఉదయం మహాగణపతి పూజ, మహాన్యాస పారాయణం, మహాలింగార్చన, ఏకాదశ వార రుద్రాభిషేకం, అగ్ని ప్రతిష్ట, రుద్ర స్వాహకార హోమం, శాంతి హోమం, పౌష్టిత హోమం, పూర్ణాహుతి మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రము కార్యక్రమాన్ని హాజరైన మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అల్పాహారము, భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సింగతల మధుసూదన్ రెడ్డి, లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కానాల ఈడిగ నరసింహులు, పలువురు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# హరి నగరంలో అగ్నిప్రమాదం.

## -గుడిసె దగ్ధం. -రూ1 లక్ష నష్టం.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం, మే 27:
మండల పరిధిలోని హరినగరం గ్రామంలో విద్యుత్ షార్క్ సర్క్యూట్ ప్రమాదంలో గుడిసె దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ 1 లక్ష విలువచేసే దుస్తులు, వంట సామాగ్రి, ధాన్యము కాళీ బూడిద అయ్యాయన్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సవరం నాగరాజు అనే వ్యక్తి ఇంటిలో విద్యుత్ షాట్ సర్క్యూట్ ప్రమాదంతో మంటలు వ్యాపించి గుడిసె పూర్తిగా దగ్ధమైందన్నారు. సంఘటన గమనించిన గ్రామస్తులు సకాలంలో స్పందించి మంటలు అదుపు చేశారన్నారు. కట్టుకున్న బట్టలతో బాధిత కుటుంబం అగ్ని ప్రమాదం నుంచి బయటపడ్డారని వారికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి బాధితుని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.హరి నగరం గ్రామంలో అగ్ని ప్రమాద బాధితుడు సవరం నాగరాజుకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. వైసీపీ నాయకుడు సవరం నాగ ముని, వీఆర్వో ఓబులేసు చేతుల మీదుగా బియ్యము ,కందిబేళ్లు ఆయిల్, ఇతర నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు.

# అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం

## దళిత గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం అమానుషం- సీపీఐ




ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 27:
నంద్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక శాసనసభ్యుడు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి తన ఓట్ల రాజకీయం కోసం సినీ నటుడు అల్లు అర్జున్ ను పిలిపించడం జరిగిందని కానీ అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం స్థానిక జిల్లా పోలీసు అధికారులు కిందిస్థాయి దళిత గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం అమానుషమని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు డిమాండ్ చేశారు.
నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది ఈ సమావేశములో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నాగరాముడు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి ధనుంజయుడు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్.ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిప్రభాకర్. సిపిఐ జిల్లా సమితి సభ్యులు. వై. భార్గవ్. నారాయణ. బాలకృష్ణ.హరినాథ్.ఆర్ సామేలు. సురేషు.పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ... నంద్యాల జిల్లాలో అధికార పార్టీ నాయకులు ఎన్నికల నిబంధన ఉల్లగించినా పోలీస్ అధికారులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేయడం జరిగిందని కానీ నంద్యాల జిల్లా కేంద్రంలో దొంగతనాలు, హత్యలు, హత్యాయత్నాలు, విపరీతమైన క్రైమ్ జరుగుతున్న ఏమాత్రం పట్టించుకోకపోవడం అధికారుల చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. నంద్యాల పట్టణానికి ఎన్నికల ప్రచారానికై జిల్లా ఎన్నికల అధికారులతో ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా సినీ నటుడు అల్లు అర్జున్ స్థానిక వైసిపి శాసనసభ్యులు రవిచంద్ర రెడ్డి కిషోర్ రెడ్డి పిలుచుకుని రావడం దానివల్ల వేలాదిమంది ప్రజలు సినిమా యాక్టర్ ను చూచేందుకు నిబంధనలు ఉల్లంఘించారని జిల్లా పోలీసు ఎన్నికల అధికారులు ఈవేమీ పట్టించుకోకుండా దళిత గిరిజన క్రైమ్ పార్టీ పోలీసులను సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమని ఎలక్షన్ కమిషన్ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల, పోలీసు అధికారులు సస్పెండ్ అయిన పోలీస్ కానిస్టేబుళ్లను తిరిగి విధుల్లోకి తీసుకొని ఎన్నికల నిబంధనలు ఉలగించిన అధికార పార్టీ నాయకుల పై కేసులు నమోదు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పై నాయకులు ఎన్నికల కమిషన్ను డిమాండ్ చేశారు చేశారు.

# రమాబాయి ఆత్మస్థైర్యం మహిళలకు ఆదర్శం.



ఆంధ్ర ప్రగతి కర్నూలు మే 27:
రమాబాయి ఆత్మస్థైర్యం మహిళలందరికి ఆదర్శం అని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. కర్నూలు నందలి స్థానిక మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ అధ్వర్యంలో జరిగిన రమాబాయి అంబేద్కర్ 89వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి లు మాతా రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ రమాబాయి అంబేద్కర్ తన త్యాగాల పునాదుల మీద బాబా సాహెబ్ అంబేద్కర్ ని ఒక మేరు పర్వతంగా నిలబెట్టిందని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఒక్కో మెట్టు వెనుక రమాబాయి పంటి బిగువున బిగపట్టిన బాధ తాలూకు గాయాలు ఎన్నో ఉన్నాయని ఆమె అన్నారు. అంబేద్కర్ గారికి నిరంతరం నీడలా ఉంటూ ఎన్నో కష్టాలను అనుభవిస్తూ జీవితం సాగించడములో రమాబాయి ఆత్మస్థైర్యం మనకు అర్థం అవుతుందని ఆమె తెలిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఉన్నత చదువులకోసం లండన్ వెళ్ళినప్పుడు ఎన్నో కష్టాలను అనుభవించి కుటుంబ బాధ్యతలను రమాబాయి ఒక్కరే నేరవేర్చుకుంటూ, తన పిల్లలు ఆకలితో అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిన సందర్భంలో కూడా ఆమె అంబేద్కర్ కి ఎంతో మనోధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించిన గొప్ప మహిళ అని ఆమె తెలిపారు. అంబేద్కర్ బహుజన సమాజానికి ఎంత కృషి చేశారో అంతే కృషి అంబేద్కర్ గారికి రమాబాయి చేశారన్నది జగమెరిగిన వాస్తవమని ఆమె అన్నారు.మాతా రమాబాయి త్యాగాల నిలువెత్తు రూపము బాబా సాహెబ్ అంబేద్కర్ అని ఆమె తెలిపారు.

## ఆళ్లగడ్డ టౌన్ నాలుగు రోడ్ల కూడలి వద్ద

# మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్

**పరిస్థితులు ఏవైనా.. ఎలాంటి సవాళ్లు నైనామాక్ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశం.**
**-జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహణకు అనుమతి లేదు.**
**చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు. -జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి.**







ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ మే 27:
నంద్యాల జిల్లాలో ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం అయినప్పుడు అల్లరి మూకను ఏ విధంగా అదుపు చేస్తూ చెదరగొట్టాలో తెలియజేస్తూ నేడు ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పోలీసులు మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ ను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి పోలీసులు ఇప్పటి నుండే సమాయత్తమై ఉన్నారు అనే సందేశాన్ని జిల్లా ప్రజలకు ఈ మాక్ డ్రిల్ ద్వారా ఇస్తున్నాము. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంది. అలాగే సెక్షన్ 144 సి ఆర్ పి సి, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ కూడా అమలులో ఉంది. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే అట్టి వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో జిల్లా ప్రజలకు (ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రజలకు )తెలియజేసేందుకు ఈరోజు ఇక్కడ మాక్ డ్రిల్ చేసాం. కౌంటింగ్ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లును అవసరమైన మేరకు బైండోవర్, హౌస్ అరెస్ట్ చేయడం జరిగింది.ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా నాకా బందీలు, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్, ఫ్లాగ్ మార్చ్ వంటి కార్యక్రమాలు చేస్తూ అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీసులు పై కార్యక్రమాలను చేయుచున్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్, ఆళ్లగడ్డ టౌన్ డిఎస్పి ఎస్ .షర్ఫుద్దీన్ ,ఇన్స్పెక్టర్లు రమేష్ బాబు,చంద్రబాబు, హనుమంతు నాయక్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు, సబ్- ఇన్స్పెక్టర్లు వెంకట రెడ్డి, నగీన, నరసింహులు,సురేష్,రామంజనేయరెడ్డి, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

# ఏపీలో ఎన్డీఏ కూటమి దే అధికారం..!

## -కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు.



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 27:
ఆంధ్రప్రదేశ్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు ఇటీవల ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే. దీంతో జూన్ 4న వెలువడే ఫలితాలపై స్టేట్ పాలిటిక్స్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.రాష్ట్రంలో ఏ పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయి..? ఎవరు ముఖ్యమంత్రి అవుతారు..? అన్న చర్చలు రాజకీయ పార్టీలతో పాటు సామాన్య ప్రజల్లో మొదలయ్యాయి. ఈ క్రమంలో ఏపీ ఎన్నికల ఫలితాలపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా నేషనల్ మీడియా పీటీఐకు అమిత్ షా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.ఏపీలో ఎన్డీఏ కూటమి 17 ఎంపీ స్థానాలు గెలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పట్ల సంతృప్తితో ఉన్నారని అన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి అలాగే ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రం ఒడిషాలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఏపీ, కర్నాటకలో కాంగ్రెస్ రాజ్యాంగానికి విరుద్ధంగా మతపరమైన ముస్లిం రిజర్వేషన్లు అమలు చేసిందని ఫైర్ అయ్యారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి వ్యతిరేకమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి.. ఓబీసీల రిజర్వేషన్లను కాపాడుతామని హామీ ఇచ్చారు.

## మోదీ మరోసారి ప్రధాని కాబోరు...

# ఇది నా గ్యారెంటీ

## :రాహుల్ గాంధీ



ఆంధ్ర ప్రగతిబీహార్ మే 27: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కాబోరని... ఇది తన గ్యారెంటీ అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీహార్లో ఆయన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధాని మోదీ తనను తాను నిజమైన దేశభక్తుడిగా ప్రకటించుకుంటారని... కానీ అగ్నిపథ్ పథకంతో జవాన్లను అవమానించారని విమర్శించారు.
సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే ప్రధాని మోదీ తనను దేశం కోసం భగవంతుడు పంపించాడని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. తానొక నిజమైన దేశభక్తుడినని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందుకే ఆయన మరోసారి ప్రధాని కావడం కష్టమే అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న కాషాయ పార్టీ కుట్రలను తాము తిప్పికొడతామని పేర్కొన్నారు. ఇండియా కూటమికి ఆదరణ లభిస్తోందని... విజయం ఖాయమన్నారు.
ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అగ్నిపథ్ను తొలగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. నెల నెలా ప్రతి మహిళా బ్యాంకు ఖాతాలో రూ.8500 జమ చేస్తామన్నారు.
ఎన్నికల తర్వాత బీజేపీ ఓడిపోతుందని... అప్పుడు మోదీని ఈడీ ప్రశ్నించడం ఖాయమన్నారు. అదానీ గురించి ఈడీ అడిగితే... 'తనకు తెలియదు... దేవుడు చెప్పాడు' అని మోదీ అంటారని ఎద్దేవా చేశారు. మోదీ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తారని... ప్రజలను విడదీసే ప్రయత్నాలు చేస్తారని ఆరోపించారు. కానీ దేశంలోని యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. విభజన రాజకీయాలు చేయకుండా... నిరుద్యోగిత వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.